
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 35
నూరేళ్ళ తెలుగు కథకు



# బుచ్చిబాబు నిష్క్రమణం కొత్త పుస్తకాన్ని మధ్యలో చించడమే!

-శివరాజు సుబ్బలక్ష్మి

కలం, కుంచె చేతబట్టి సమస్థాయిలో నడిపిన సమర్థ బుచ్చిబాబుకి సవ్యసాచిత్వంలో అక్షరాలా అర్ధాంగి. మనసులోని భావాలను కథలు, నవలలుగా హృదయానికి హత్తుకునే ప్రకృతి దృశ్యాలను చిత్రాలుగా మలిచే చేయి తిరిగిన రచయిత్రి. జగమెరిగిన 'బుచ్చిబాబు భార్య' అన్న బిరుదు. ఆయనకు దీటెన కథకురాలన్న కితాబు పొందిన ఎనభై యేళ్ల కథా చైతన్యం శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మి. టీన్స్‌లోకి రాకుండానే పెళ్లి, ట్వెంటీ సెవన్లో అచ్చయిన తొలికథకి మధ్య వున్న పదిహేనేళ్ల కాలం, కలాన్ని పదునెక్కించే జీవితానుభవాల్ని పంచిన వైనానికి ఆసక్తికర అక్షర రూపం ఈ వారం కథా నీరాజనం

## చిన్ననాటి మాట

ఎంత అక్షరాల్లో పెట్టాలనుకున్నా చిన్నతనం 'ఇదీ' అని రూపుకట్టలేని అపురూపమైన అనుభూతి. మేం ముగ్గురం అక్కచెల్లెళ్లు, ముగ్గురు అన్నదమ్ములం. అమ్మ సత్యవాణి, నాన్నగారు ద్రోణంరాజు సూర్యప్రకాశరావు. మంచి కుటుంబం. సెప్టెంబర్ 17న 1925లో పుట్టాను. ఇప్పనపాడు, ద్వారపూడి, రాజమండ్రి, తాపేశ్వరం ఊళ్లన్నీ సొంతవూళ్లే అనిపిస్తుంది.

సూర్యుడు ఉదయించకుండానే నాన్నగారితో కలిసి పళ్లు తోముకోవడం, వేడివేడి గుమ్మపాలతో గోరోజనం వేసుకుని తాగడం భలేగా వుండేది. చద్దన్నాలు లేవు. పొద్దున్నే వేడన్నం వండి పెట్టేవారు. పెరుగుతో తినడం, లేకపోతే పెసరట్లు ఉప్మా.

తొమ్మిదేళ్లు వచ్చేసరికి కొన్ని ఆంక్షలు. ఎక్కువ మాట్లాడకూడదు. వోణీ తియ్యకూడదు. అక్కతో కలిసే స్కూలుకెళ్లాలి, సంగీతం మాష్టార్ని వెక్కిరించకూడదు. అమరకోశం కంఠస్థం చెయ్యాలి. నాన్నగారు పిల్చినప్పుడే వెళ్లి ఇంగ్లీషు నేర్చుకోవాలి.




ఇవన్నీ మా అమ్మ పెట్టిన ఆంక్షలు. మా పెద్దబామ్మ మా ఇంటికి ఒకరోజు చుట్టపు చూపుగా వచ్చిన కాంచనపల్లి కనకమ్మగారు నా పక్షం. కనకమ్మగారు అప్పటికే రాస్తుండే వారు. తలుపు చాటు నుంచి తొంగి చూస్తున్న నన్ను ముందుకి పిలిచి "సుబ్బులేనా! అప్పుడే పమిటలు వేయించారేమిటి?" అంటూ "నాలా రాస్తానానే దానివిగా! నువ్వు కథలు రాయచ్చు. రాస్తావా?" అన్నారు. వెంటనే బామ్మ "అది రాసినా రాస్తుంది. సిసింద్రీ. ఏదైనా ఇట్టే పట్టేస్తుంది. వాళ్ల నాన్న దగ్గర ఇంగ్లీషు నేర్చుకుంటోంది" అని మెచ్చుకుంది. బహుశా, కథ రాయాలన్న దానికి అది తొలిస్ఫూర్తి అనుకుంటాను.

అక్క మొగుడొస్తే నీ మొగుడూ వస్తాడన్నట్లు అక్కపెళ్లి అయిన కొన్నాళ్లకే నా పెళ్లి కుదిరిపోయింది. పెళ్లిచూపులు, వారంలో పెళ్లి అన్నీ తొందర తొందరగా జరిగిపోయాయి. ఆ ఏడాది మండపేటలో ఏడో తరగతి వరకూ క్లాసులు పెంచారని హెడ్మాష్టారు మా ఇంట్లో చెప్పారు. ఆరో క్లాసులో నాకు లెక్కల్లో, ఇంగ్లీషులో ఫస్ట్ మార్కులు. మా తమ్ముడికి తక్కువ మార్కులొచ్చినా వాడిని మా నాన్నపేరు వల్ల ప్రమోట్ చేశారు. ఏడో క్లాసు చదవకుండానే "నీకు చదువొస్తుందని తెలుసు. మంచి సంబంధం, తర్వాత మెట్రిక్ కట్టిస్తానులే" అని నాన్నగారు ధైర్యం చెప్పినా, నమ్మకం కలగలేదు. వైభవంగా పెళ్లయిపోయింది.

పెళ్లికొడుకు బుచ్చిబాబు (శివరాజు సుబ్బారావు). అప్పటికే 'బి.ఎ., ఎం.ఎ మద్రాసులో చేస్తానని, మీ అమ్మాయిని చదివించమనీ, ఇంకొంచెం మంచి మాష్టార్ని పెట్టి ఆ వయొలిన్ మెరుగ్గా వాయించేటట్లు ప్రాక్టీసు చేయించమనీ...' మా నాన్నగారికి ఉత్తరం రాశారు. ఆయన చదువు వల్ల నా పన్నెండో ఏట 1937 డిసెంబరు 23న పెళ్లయిన నేను కొన్నాళ్లు అత్తింట, కొన్నాళ్లు పుట్టింట వుండేదాన్ని. అమ్మలాగే అత్తగారూ! 'గట్టిగా నవ్వకూడదు. చప్పుడు చేస్తూ నడవకూడదు, పలకరించకుండా ఎవరితో మాట్లాడకూడదు..' అని ఆంక్షలు. కానీ స్వేచ్ఛ, అభ్యుదయ భావాలు వున్న బుచ్చిబాబు నా భర్త కావడం నా అదృష్టం. నాకు చలం పుస్తకాలు కొనిచ్చింది తనే!

## నక్షత్రాలు నవ్వాయి

ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాక ఆయన నా పేర ఉత్తరం రాశారు. ఉత్తరం అంతా నక్షత్రాలు నవ్వినట్లు, చెట్లు గుసగుసలాడినట్టు అనిపించింది. తనకి జాబు రాసినప్పుడు ప్రకృతిని వర్ణిస్తూ రాయమని, తను రాసిన కథ ఎలా వుందో చెప్పాలని సారాంశం. దాన్ని అత్తవారింట్లో అందరూ చదివి నాకు ఇచ్చారు. జవాబు రాసిస్తే తామే పోస్ట్ చేస్తామని అత్తగారి హుకుం. జవాబు రాయనా, వద్దా అని తటపటాయించాను. రాయడానికి మా అత్తగారు తెల్లకాగితం, పెన్ను పంపారు. ఎప్పుడూ ఉత్తరం రాయాల్సిన అవసరం రాలేదు. అందులో ఆయనకి! ఎలా మొదలు పెట్టాలో తెలియలేదు. ఆఖరికి "మీ ఉత్తరం నాకు చాలా నచ్చింది. ఎందుకంటే ఆ ఉత్తరంలో నక్షత్రాలు నేను రోజూ మా నాన్నగారు చెబుతుంటే చూసేవే! అందుకే మీకు నక్షత్రాలంటే ఇష్టం అని తెలిసి ఆనందించా. నా ఉంగరం పాతిపెట్టి మొక్క కోసం ఎదురు చూసే విషయం కథలా రాయాలని వుంది. ఎక్కడ మొదలెట్టాలో తెలీడం లేదు. ఈసారి మీరు వచ్చినప్పుడు కథ రాసి చూపెడతా" అని పూర్తి చేశాను. ఆ ఉత్తరం మా పిన్నత్తగారి కూతురు చదివి 'వీళ్లిద్దరికీ ఒక రకం బుద్ధులే వున్నట్లున్నాయి. నక్షత్రాల గోల. ఉత్తరం అంతా అదే!' అని కవర్లో పెట్టింది. ఆఖరికది మర్నాడు మద్రాస్ ప్రయాణం వుండడంతో స్వయంగా అందుకున్నారు బుచ్చిబాబు.

## యుగళం

ఆయన ఉద్యోగ రీత్యా ఊళ్లు మారాలి. అనంతపురం, వైజాగ్ (ఇంగ్లీషు లెక్చరర్) మద్రాసు (ఆలిండియా రేడియో) నుండి విజయవాడ, హైదరాబాద్ (1967 సెప్టెంబర్ 20న తను పోయారు). ఇంగ్లీష్ సినిమాలు చూసే వాళ్లు. విజయవాడలో వుండగానే చాలా తెలుగు, ఇంగ్లీష్ సినిమాలు చూశాం. వాటిల్లో కథల గురించి కూడా చర్చించుకునే వాళ్లు.

నా మొదటి కథ 'కాపురం' 1952 పత్రికలో వచ్చింది. జరుక్‌శాస్త్రి ప్రశంసలందుకుంది. సుబ్బలక్ష్మి కథలు 'మనిషి మనసులోంచి వచ్చిన కథలు' అన్నది ఆయనిచ్చిన కితాబే! యువలో వచ్చిన 'ముంజేతి కంకణం' చదివి అద్దేపల్లి వివేకానంద, 'తీరని మమతలు' చదివి కందాళం రాఘవాచారి వంటివారు ఇంటికొచ్చి. ఎందుకు నచ్చాయో చెప్పారు. ఆంధ్ర మహిళలో వచ్చిన 'మట్టిగోడల మధ్య గడ్డి పోచ' కథకి 'మట్టిలో పుట్టిన మాణిక్యం మీ కథ' అని మాలతీ చందూర్ స్వయానా ఆ పత్రిక నిర్వాహకురాలై కూడా రాసిన చిన్న ఉత్తరం సరదాగా చెప్పుకోడానికి కొన్ని.

చిన్నచిన్న కథలు రాసి, అల్మారాల్లో పరిచిన కాగితాల కింద దాచి పెట్టేస్తుండే దాన్ని. ఓసారి పెట్టి ఎవరికో కావాలంటే ఇవ్వాల్సి వచ్చినప్పుడు నా స్నేహితురాలు, తర్వాత కాపురానికి వెళ్లాక అల్మారాలు సర్దేటప్పుడు బుచ్చిబాబు గారు నా కథల బండారం కనిపెట్టి పత్రికలకి పంపేలా ప్రోత్సహించారు. రాయడం అంటూ మొదలెట్టాకా ఏదో ఒకటి రాయాలన్న తపన నా చేత కొన్ని మంచి కథల్ని రాయించిందనకుంటాను. అవి చదివి మెచ్చుకున్న వాళ్ల మాటలు, మెచ్చుకోళ్లు సన్మానాల కంటే ఎక్కువ.

బుచ్చిబాబుగారు నా కథ పడ్డ మ్యాగజైన్ తిరగేస్తూ 'చూడు, నీ కథ వచ్చింది' అని ఇవ్వడమే తప్ప బాగుంది, బాగులేదని చెప్పేవారు కాదు. 1961లో పూనాలో వుండగా ఇలస్ట్రేటెడ్ వీక్లీలో నా 'మనోవ్యథకి మందుంది' కథని ఎవరో ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేశారు. ఆ పత్రిక తెచ్చి 'ట్రాన్స్‌లేషన్ బాగా చేశాడు. కాదులే, నీ కథ బాగుంది గనకే చేశాడాయన. ఇంత మంచి కథ రాసిన నీకేదైనా కొని పెట్టాలని వుంది. బైటికి వెళదాం పద, అన్నట్టు 'జరుక్' ఉత్తరం రాశాడు. నీ మొదటి కథ పడినప్పుడు రాసి పెట్టాట్ట ఉత్తరం. పుస్తకాలు సర్దుతుంటే దొరికిందట. నేను నా కథని ఓ నవలగా పూర్తిచేసి, అందులో కథ నాయికని వర్ణనలతో కట్టేసి ఏ బాంబే స్టూడియోలోనో అద్దాల తలుపుల వెనక నగ్నంగా చూపిస్తానుట. నువ్వేమో కమ్మని కంది పచ్చడి, వంకాయ పులుసు పచ్చడిలాంటి రుచితో తలుపుచాటు నుంచి సున్నితంగా చెప్తావుట... ఇంకా ఏమేమో రాశాడు' అన్నారు ఉత్తరం ఇస్తూ. ఎంతో సంతోషం వేసింది బుచ్చిబాబు గారి స్పందనకి.

## నేనే తొలి పాఠకురాలిని

మేమిద్దరం గడిపిన ప్రశాంత జీవితం పదే పదే

## నచ్చినవి

| | | |
|---|---|---|
| రచయిత | - | చలం |
| కథలు | - | ఆమె నీడ, నా గురించి కథరాయవూ! (బుచ్చిబాబు) |
| సినిమా కవి | - | దేవులపల్లి కృష్ణశాస్త్రి |
| సినిమా కథ | - | మాలపిల్ల |
| పాట | - | కారులో షికారుకెళ్లే... |
| గాయకుడు | - | రఫీ |
| గాయని | - | సుశీల |
| నచ్చిన నవల | - | నారాయణరావు (అడవి బాపిరాజు) |
| స్నేహితురాలు | - | పి.రంగనాయకి (కొన్ని నెలల కిందటే కీర్తి శేషురాలు) |
| బంధువు | - | మేనల్లుడు సుబ్బారావు (బుజ్జాయి) |
| దైవం | - | వేంకటరమణమూర్తి |
| ప్రదేశం | - | బదరీనాథ్, హిమాలయాలు |



భర్త బుచ్చిబాబుతో.....

గుర్తొస్తుంది. బుచ్చిబాబు గారి కథలు చదవడం, పొరపాటున వాక్యాలు వదిలేస్తే చేర్చడం, పత్రికలకి పంపమని పురమాయిస్తే పంపడం చేసేదాన్ని. గోదావరి గట్టు మీద కూర్చున్నప్పుడు 'ఈ కథ ఇలా పూర్తి చేస్తే ఎలా వుంటుంది?' అని అడిగే వారాయన. ప్రతిఏటా చక్కని స్థలం ఎంచుకుని, డబ్బు సమకూర్చుకుని లేపాక్షి మొదలు ఎన్నో చూశాం. ప్రయాణంలో కథలు రాసుకుంటూ, బొమ్మలు వేసుకుంటూ సాహితీ మిత్రుల్ని కలుసుకుంటూ... మధురమైన అనుభూతులు పంచుకునే వాళ్ళం. తనని బట్టే బొమ్మలు వేయడం నాకు అలవాటయింది. ఆయనేం రాసినా నేను చదివి బాగుందంటేనే ఏపత్రికకైనా పంపే వారు.

1964లో గద్దె లింగయ్యగారు నా కథలు 'ఒడ్డుకి చేరిన ఒంటరి కెరటం, కావ్యసుందరి కథ, మగజీవి చివరిచూపు' పేరిట మూడు సంపుటాలు వేశారు. ఆ తర్వాతి కథలు సంపుటాలుగా రాలేదు. 1998లో బుచ్చిబాబు స్మారక కథా కదంబంగా 'మనోవ్యాధికి మందుంది' పేరుతో 28 కథల సంపుటి వచ్చింది. నవలలూ రాశాను. అదృష్టరేఖ, నీలంగేటు అయ్యగారు, తీర్పు మొదలైనవి.

బుచ్చిబాబు బామ్మగారికి నేను భాగవతం చదివి వినిపిస్తే ఆవిడ బాగా అర్థం అయ్యేలా విడమర్చి చెప్పేవారు. సంస్కృతాంధ్ర పురాణేతిహాసాలు బాగా చదివాను. అందుకే నా ఇంగ్లీష్ డౌట్లు బుచ్చిబాబు, ఆయన సంస్కృత సందేహాలు నేను తీర్చుకునే వాళ్ళం.

### ప్రముఖుల పరిచయాలు

మద్రాసులో మా ఇంటి దగ్గరే కాంచనమాల ఉండేది. నా జుట్టు మెచ్చుకుంటూ జడ అల్లేది. ఆలిండియా రేడియో జనమంచి రామకృష్ణ మా సాహిత్యాభిమాని. పెళ్లయిన ఏడాదికి 1938-39లో సామర్లకోట స్టేషన్లో రవీంద్రనాథ్ ఠాగూర్‌ని చాలా సన్నిహితంగా చూపించారు నాన్నగారు. 'బెంగాలీలా వున్నావని' నన్ను ఆయన హిందీలో నవ్వుతూ పలకరించారు. 1946లో గాంధీగార్ని

భర్త, మిత్రులతో....



నేను, బుచ్చిబాబు కలిసి చూశాం. భుజం మీద చెయ్యేసి కాస్త దూరం నడిపించారాయన. అప్పుడే అనుకుంటా ఆర్టిస్ట్ చామకూరి సూర్యనారాయణగారు గాంధీబొమ్మని 300 రూపాయలకు వేలం వేసి నిధికి ఇచ్చారు.

ఇంట్లో సరుకులు ఉన్నాయా లేదో తెలుసుకోకుండా ఇంటికి పదిమంది భోజనానికి వస్తున్నారని ఆఫీసు నుంచి కబురు చేసేవారు బుచ్చిబాబు. ఓసారి విజయవాడలో వున్నప్పుడు ఇంట్లో కూరలు లేవు. కాళేశ్వర్రావు మార్కెట్‌కి వెళ్లి హడావుడిగా కూరలు కొంటూ 'వీశ ముప్పావలా' అనగానే 'ఇచ్చెయ్' అన్నాను. అతిథులకి గుత్తొంకాయ కూర వండాలి మరి. ఇంతలో ''నువ్వలా బేరం ఆడకుండా ఎంతకంటే అంతకి కొనేస్తే పుచ్చులున్నాయా లేదా కూడా చూడకుండా! నేనెలా కొనాలి? నన్నింక వాడు బేరం ఆడనిస్తాడా?'' అన్న మాటలు విని వెనక్కి తిరిగి చూశాను. కూరల సంచీ పట్టుకుని విశ్వనాథ సత్యనారాయణగారు నిలబడి వున్నారు. విషయం చెప్పాను. నవ్వుకున్నారు.

చెబితే నమ్మరు. బుచ్చిబాబు గారి జీతం పుస్తకాలకి, ఇతరత్రా ఖర్చులకు పోతే, ఇంటి ఖర్చుకి నా ఒంటిమీద బంగారం తాకట్టు పెట్టడం రాక, అమ్మేసిన రోజులున్నాయి. అవన్నీ గమ్మత్తు రోజులు.

హైదరాబాద్‌లో వున్నప్పుడయితే సాయంత్రం అయ్యే సరికి కృష్ణశాస్త్రి, శివశంకరశాస్త్రి వంటి వారితో మా ఇంట్లో సాహిత్యగోష్ఠి జరిగేది.

### తేడా ఏంటంటే

మా మారి కథల్లో వర్ణన లెక్కువ. మా ఇద్దరి కథలకి తేడా వుండాలని నేను వర్ణనల జోలికి పోలేదు. ఆయనవి విషాదాంతాలు చాలావరకు. నాకు ట్రాజెడీ నచ్చదు. అందుకే వాళ్లని (కథ కోసమైనా) చంపకండి, బతకనీయండి అంటుండే దాన్ని. ఏ విషయంగానూ మా మధ్య రహస్యాలుండేవి కావు. కానీ ఆనందంగా గడిచిన జీవితంలో బుచ్చిబాబు నిష్క్రమణ విషాదాంతం. కొత్త పుస్తకాన్ని మధ్యకు చింపిన బాధ. స్మృతులు మనల్ని నడిపిస్తాయి.

### శతజయంతి కథలు

వందేళ్ల తెలుగు కథని తల్చుకోవడం అంటే అంత మం(చి)ది కథకుల్ని, కథల్ని సామాజిక నేపథ్యాల్ని, మనుషుల్ని మనస్తత్వాల్ని ఇంకా ఎన్నింటినో తల్చుకోవడం. చలం, కృష్ణశాస్త్రి, భమిడిపాటి, బాపిరాజు ఇలా... రచయితల్ని గౌరవిస్తూ ఈ శీర్షిక నిర్వహించడం బాగుంది. కథల్లో ప్రశ్నలుండాలి. ఆలోచింపచేయాలి. అలాని కరపత్రంలా అవే డామినేట్ చేయకూడదు.

ప్రస్తుతం మనవడి కబుర్లు వింటూ, కథలు రాసుకుంటూ, బొమ్మలు వేసుకుంటూ కాలక్షేపం చెప్పానుగా బొమ్మలు వేయడంలో నాకు గురువు బుచ్చిబాబు గారే!

-కె.బి.లక్ష్మి

నాకు నచ్చిన నా కథ

# తీరని మమతలు

- శివరాజు సుబ్బలక్ష్మి

**కృష్ణభగవానుని దర్శనం కోరుతూ, పారవశ్యంతో, గోపికలు గొంతులెత్తి గీతికలు పాడుకుంటున్నారు. భవనం లోపలి దీపకళికల కాంతి గోపికల ముక్కునత్తులపై పడి, రంగులు మార్చుకున్నాయి. రకరకాల పువ్వులతో తీగెలు చుట్టుకున్నట్టు గోపికలు భవనం చుట్టూ తిరుగుతూ, మధ్య మధ్య చేతులుతట్టి 'కృష్ణా' అని ఏకకంఠంగా పిలుస్తున్నారు. నల్లని మేఘాలు కృష్ణుని ఉత్తరీయంలా మెరుపుల్ని చుట్టుకుంటూ, అన్ని దిక్కులూ చూస్తున్నాయి. ఆ కాంతిలో గోపికలు కృష్ణుడు తమని వదిలి మిగిలిన గోపికల దగ్గర ఉన్నాడేమోనని కళ్లతో వెతుకుతున్నారు.**

మిత్రవింద నిట్టూరుస్తూ, మెట్లపైన కూర్చుంది. 'దేవి, దేవి' అని, వగరుస్తూ పరిచారికలు ఆసనం మోసుకువచ్చారు.

మిత్రవిందకి గుర్తు వచ్చింది. అది దేవకీదేవి భవనం. అందరికీ సమంగా జరుగుతాయి లాంఛనాలు, దూరంగా గోపికలు పాడేపాట వినబడుతోంది. ఏమిటో, తను పెద్దరాణుల్తో చేరలేదు. అట్లాగని మరీ, చిన్న ఆవిడలా, మంకుపట్టుకీ, మందలింపుకీ, నోచుకోలేదు. పోనీ ఆ గోపికల్లా స్వేచ్ఛగా ఉండేందుకు కూడా వీల్లేదు కదా!

మనస్సుకి చిరాకుగా తోచింది. అటూ ఇటూ తిరిగింది. పరిచారికలకోసం, వాళ్లు తెచ్చిన ఆసనంపై కూలబడి జడలో మొగ్గలు విడవటం చూచుకుంటూ కూర్చుంది.

భవనం రెండవ అంతస్తు విశాలంగా వుంది. రత్నకంబళ్ళు పరిచి, పువ్వుల పరిమళాలతో, అగరువత్తుల ధూపాలతో, కస్తూరితో చేరిన సుగంధాలు కృష్ణుని ఉనికిని తమలో దాచుకున్నట్లు ఆ ప్రాంతాన్ని అంతా చుడుతున్నాయి.

సత్యాదేవికి ఓర్పు తగ్గి, కోపంగా మారింది. కాళ్ల అందెల చప్పుడును పెద్దదిచేస్తూ, గదులన్నీ ఎన్నోసార్లు చుట్టింది. పువ్వులు కట్టిన వుయ్యాల ఒంటిగా కదులుతోంది. దూరంగా యమున ఘోషపెడుతోంది. 'ఏమిటీ కోరిక దేవకీదేవికి?' అనుకుంటూ కృష్ణుడు కూర్చునే స్థానంలో ఉయ్యాల మీద ఒరిగింది.

ఎన్ని అష్టములు జరుపుకోలేదు తన దగ్గర! అయినా మనస్సుకి తృప్తిలేదు.

తను లేకపోతే జీవం లేని శరీరంలా ఉంటుందని ఎన్నిసార్లు చెప్పలేదు! తన దగ్గర ఉన్నప్పుడు ఎంత అమాయకత్వం! అసలు మిగిలిన వాళ్లంటే ఇష్టం లేనట్లు తోపిస్తాడు.

ఈసారి ఏమ్మైనాసరే నమ్మకూడదు. అసలు ఈ రాత్రి ఇక్కడికి వస్తాడన్న నమ్మకమేమిటి?

కోపం విచారంగా మారింది. అసలు తన తండ్రిదే తప్పు. తను వేసిన నిందని మార్చలేక తనని కట్టబెట్టటం ఏమిటి? ఎవరికో నిర్ణయించిన పడుచుని తెచ్చుకున్ననాడే అతని మీద తను ఆశ వదులుకుంది. తన తండ్రికి అదే అలుసు అయి పిల్లని చూపి, పాత పగలు మరువవచ్చని ఆశ కలిగింది.

తల్లో పువ్వులు బరువెక్కుతున్నాయి. ఒక్కటొకటే ఒలిచి విసురుతోంది.

అబ్బా ఆ రుక్మిణికి ఆత్మలో ఉంటాడుట! అన్నీ వట్టిమాటలు! తన దగ్గర ఉండటం లేదన్న అక్కసుతో ఇలా వెనకచేరి పై అంతస్తులో రెప్పవాల్చకుండా ఆ చూపులేమిటి? పాపం! ఆ చూపులు దాటి రాలేక శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడేమే కృష్ణుడు! ఆ తలపు రాగానే సత్యాదేవికి మనస్సు కొంత స్థిమిత పడింది. విచారం దుఃఖంగా మారి తన మీద తనకే జాలి కలిగింది.

ఆ రాధలా ఎవరి పడతినో అయివుంటే, ఎంత పరితపించి ఉండును! అవును, అల్లా జరిగివుంటే బాగుండేది. తన్నే నమ్ముకున్నానన్న ఇంగితమే లేని వ్యక్తికి తన గోడు ఎల్లా అర్థం అవుతుంది? తను లేని క్షణంలో కాలం నిలిచినట్టు వుంటుందే – ఆ మాత్రం అర్థం చేసుకోలేడా!


ఈ శూన్యమనసుని ఎల్లా భరించడం? రుక్మిణీ వాళ్లకులా నా మనసులో ఎందుకు నిలవడు? పోనీ, మనస్సులో నిల్పుకోవడం సాధ్యమయితే ఎంత బాగుండును? రెప్పలు బరువెక్కి, పువ్వులు దులిపిన పొగడచెట్టులా ఉయ్యాలపై లేచి కూర్చుంది సత్యాదేవి.

***

మూడవ అంతస్తు దేవకీదేవి గది. రుక్మిణీదేవి దేవకి పాదాల దగ్గర కూర్చుంది. యమునా నదిని చూసే కృష్ణభగవానుని చూపులో చూపు కలపాలన్న కోరిక మేలి ముసుగు వెనక దాచుకుంది రుక్మిణీదేవి. మనస్సు చాలా వెనక్కి వెడుతోంది. చిన్ననాటి కోరికలు కళ్ళల్లో మెదులుతున్నాయి.

అంతలో మనసుకి భీతి కలిగింది. ఆ బ్రాహ్మణుడు నిజంగా వెళ్ళకపోతే తను ఏమయ్యేది? అయినా తనకంత సాహసం ఎల్లావచ్చిందో అన్న ఆశ్చర్యం కలిగింది. తను పంపి వుండకపోతే భగవానుడు వచ్చేవాడేనా? ఆ మాట అననే అన్నాడు. -- 'స్త్రీలోలుడనయి రాలేదు. మీ అన్న గర్వం అణిచేందుకే వచ్చా'నని. అవును, తనేకదా ఊహ తెలిసిన దగ్గరనుంచి అతని కథలు విని, అతని రూపం ఊహించుకుని, మనస్సులో మమత పెంచుకుని, చివరికి కన్యకి భూష

## ఒక పరిణామ సిద్ధాంతం



*తను రాసిన వాటిలో రచయితకి కొన్ని కథల మీద మక్కువ ఎక్కువుంటుంది. అలాంటి కథే 'తీరని మమతలు'. మనకి తెలిసిన పాత్రలు మనకి పరిచయం అయినట్లు గాక తద్భిన్నంగా వుంటే... ఈ ఆలోచనతో పాత్రల అంతరంగాన్ని ఆవిష్కరించవచ్చనిపించింది. గతాన్ని తల్చుకుని, గడచిన వాటిని తల్చుకుని పశ్చాత్తాప పడ్డం ఒక చిత్రమైన మానసిక స్థితి. ఉన్న స్థితి పట్ల విసుగు కలిగిన స్త్రీ గాని, పురుషుడు గాని మరో దృక్కోణంలో జీవితాన్ని వీక్షించుకోవడం ఒక పరిణామ సిద్ధాంతం. నిజానికి ఇవి ఇప్పటి విశ్లేషణలు. కానీ అప్పుడు అలా గమ్మత్తుగా రాసేశాను. ఎప్పుడు చదివినా ఆ కథ కొత్తగా అనిపిస్తుంది నాకు. మరి మీకేమనిపిస్తుందో!*

*- శివరాజు సుబ్బలక్ష్మి*

*బి-6, 204, ఎల్ అండ్ టి సౌత్ సిటీ,*
*అరకెరె మైకో లే అవుట్, బన్నేర్‌ఘట్ట రోడ్*
*బెంగుళూర్ - 560 076*
*ఫోన్: 080-41642531*



ణమైన బిడియం విడిచి, ఆ విప్రుని ముందు తన కోరిక చెప్పి పంపిన దగ్గర నుంచి ప్రతిక్షణం ఏమివార్త వస్తుందోనని మనస్సులోని బాధకి తోడు అన్న చేసే పెళ్లి ప్రయత్నం చూసి జీవితం మీద మమకారం పోవటం, అప్పుడు జరుగుతున్నట్లు తోచి, మనస్సు బరువెక్కి మొహము ఎరుపెక్కి చూపులు మాధవుని పాదాల దగ్గర చేరాయి.

రుక్మిణీదేవి మనస్సు మళ్లీ కళ్లెం విడిచిన గుఱ్ఱంలా ఎటోపోతోంది. తన కోరిక మన్నించమని కబురుపెట్టి ఉండకపోతే బాగుండేది. తన కోసం కృష్ణ భగవానుని బాధ పెట్టడం ఏమిటి? ఎప్పటిదో పారిజాతం పువ్వు గుర్తుకువచ్చింది. నారదుడు పువ్వు ఇచ్చి ఎవరిమీద మక్కువ ఎక్కువో వారికే ఈ పువ్వు ఇవ్వమనటం, కొంతసేపు యోచన చేసి, కృష్ణపరమాత్మ తనకి ఇవ్వటం ఇప్పుడు బాధగా తోచింది. పాపం, సత్యకి ఇవ్వాలని ఉండి ఉంటుంది. కాని, పక్కన ఉండటంతో ఏమి చెయ్యాలో తోచక తనకే ఇచ్చి వుండవచ్చు.

తనమీద ఇంతకంటె ఎందుకు గౌరవం ఉంటుంది? తను కోరుకొని వచ్చినది అన్నపేరు ఉండనే ఉంది. అదృష్టం అంటే సత్యదే అనాలి. అన్నివేళలా కళ్ల యెదుట కట్టుకో గలిగింది. తన మందిరంలో వున్నా ఏదో పరధ్యానంతోనే గడుపుతాడు కృష్ణభగవానుడు. రుక్మిణీదేవికి ఆలోచనతో మనస్సు దుఃఖంతో నిండింది.

***

దేవకీదేవికి కొడుకు కోడళ్లూ తన మందిరంలో ఉన్నారన్న తృప్తి ఆ సమయంలో కలగ లేదు. మనస్సు యమున ఒడ్డున చేరింది. తన తపస్సుకు మెచ్చి పరమాత్మ అవతారం ఎత్తాడు. కాని, తల్లినన్న ఆనందం తనకి ఎక్కడిది? ఆ యశోద చేసిన పూజ గొప్పది! అమ్మా!' అన్న బిడ్డని అక్కున చేర్చుకుని, వళ్లు అంతా కళ్లు చేసుకుని; ఆ మూర్తిని హృదయానికి హత్తుకుని తన్మయం చెంది వుంటుంది. పసివాని పలుకులు వినే భాగ్యం తనకి లేదాయె! జగన్మోహన స్వరూపుడి బాల్యం చూడాలన్న వాంఛే కదా తన జన్మకి హేతువు. అయినా ఆ కోరిక తీర్చలేదుకదా! నీ చిన్నారి పాదాలకు చిరుగజ్జెలు కూర్చి, మొలనూలు మువ్వలతో నింపి, చిన్ని శిఖలో తురాయిపింఛము పెట్టి నీ చిలిపి చేష్టలు చూసే భాగ్యం నాకేది?

అబ్బా! ఆ చెరసాలలో ఆ భీతి ఎన్ని జన్మలకైనా మరువలేనిది? ఆ పసికందుని నీ కోసం అధముడి చేతికి అందించాను. నిన్ను ఆ వసుదేవుడు చూడనిచ్చాడనా? అబ్బే నిన్ను నందుని యింట చేర్చాలని నన్ను మరపించి నిన్ను దూరం చేశాడు. నీ ముద్దు మురిపాలు ఏమి చూసుకున్నాను! తల్లిగా కోరి ఆనందించేది పిల్లల పసితనం, బాల్యం తండ్రికి కొడుకుపై ప్రేమ కౌమారం దగ్గర నుంచి వస్తుందేమో! లేకపోతే వసుదేవుడు తనలా బాధపడలేదు, ఎందుచేతో! అబ్బా! తనకి ఏదీ అంటదు. అల్లా ఉండగలిగితే గొప్ప విషయమేగదా! తనని కృష్ణుడు ఈ క్షణంలో ఎల్లా అడిగాడో. 'ఇప్పుడు పసివాడని' కాదా! అని అడిగినట్లు చూశాడు. చూడడమేమిటి -- అడిగినట్లు వింటేను! పసివాడు కింద పడతాడేమో!

దేవకీదేవికి ఏదో భ్రాంతి కమ్మింది. ఒక్క పరుగున కృష్ణుని ఆసనం చేరింది. ఏడీ! ఏడీ! కనబడడేం! చుట్టూ చూస్తోంది. దూరంగా యమునా నది చీకటిలో చేరి మరి చీకటి చేసింది. చీకటి ఉప్పెనలా పైకి లేచి పరిసరాలను దాచుకుంటోంది. అందులో తన చిన్ని కృష్ణుడు మెరిసిపోతూ కదలినాడు. నదిపై తేలిరావటం దేవకిచూసి, భ్రాంతి విడిచి, భీతితో 'తండ్రీ' అంటూ భీరువులా అక్కడ ఉన్న స్తంభాన్ని పట్టుకుంది. అచేతనమయిన వస్తువు కలిగినట్లు తను పట్టుకున్నది తన కృష్ణుడినేనా? ఏమో? ఏమో మాయ! తను ఇంతకు ముందేగా బాలకృష్ణుని చూసింది! ఇది ఏదో మాయ! కాదు, అదేమాయ! 'ఏది నిజం' అన్నట్లు కృష్ణునికేసి చూసింది. మందిరం అంతా కృష్ణరూపంలా తోచింది. మరుక్షణం అంతా శూన్యంగా తోస్తోంది. గట్టిగా పట్టుకుంది. చేతికి ఏదీ దొరకలేదు. కాని, ఏదో పట్టుకున్న భ్రాంతి వుంది. కృష్ణుడు నవ్వాడు. ఆ నవ్వు యమునానది నురగల్లా తేలిపోతోంది.

★